# ఓవర్ టేకింగ్

**"సతీష్, పందొమ్మిదో బిట్‌కు ఆన్సర్ ఏంట్రా?"- వెనుకసీటులో కూర్చుని పరీక్ష రాస్తున్న నితిన్‌గాడి వెధవ గొణుగుడు.**

**పదో తరగతి పబ్లిక్‌లో మ్యాథ్స్ పరీక్షలో పార్టు బి (బిట్ పేపరు) పేపరు ఆన్సర్ చేస్తున్నాం! ఇన్విజిలేటర్ యమాస్ట్రిక్ట్‌గా తల తిప్పితే వార్నింగ్ ఇస్తున్నారు.**

నాకు కావల్సిన వాతావరణం అదే! కష్టపడి చదివేవారికి అశనిపాతంగా తయారయ్యాయి ఈ కాపీకొట్టడాలు!

కాని ఏం చేయను? నితిన్‌గాడి నస ఎక్కువైంది. ఇక తప్పలేదు. "బి రా - టాన్ తీటా" -ఆన్సరు చెప్పేశాను.

"ఓకేరా!" గొణిగాడు నితిన్‌గాడు.

నాకు ఏడో బిట్ ఆన్సర్ ఎంతకీ తెలీలేదు. దాదాపు పది నిముషాలు ఆ ఒక్క బిట్టు కోసం పెన్ను చేసినా అంతు చిక్కలేదు.

వార్నింగ్ బెల్లూ, లాంగ్ బెల్లూ క్రమం తప్పకుండా మ్రోగాయి. పేపర్లు ఇన్విజిలేటరకు యిచ్చేసి, బయటకు వచ్చి, చెట్ల కింద నుంచుని ఎవరెంత రాశారో బేరీజు వేసుకునే సమయంలో-

"ఒరేయ్, నితిన్ నాకు ఏడో బిట్టు జవాబు తెలియ లేదురా! వదిలేసి వచ్చాను"- అన్నా.

"దాని జవాబు 'డి' అంట రా! నాకూ తెలీ లేదు. కాని రాఘవని అడిగితే వాడు వార్నింగ్ బెల్లు ముందు మెల్లగా గొణిగాడులే" ఆనందంతో అన్నాడు నితిన్.

నేను రాయని బిట్టుకి ఆన్సర్ నితిన్ రాశాడు!

ఫలితంగా పబ్లిక్‌లో నూటికి నూరు రావాల్సిన నాకు తొంబై తొమ్మిది, నా దగ్గరా, రాఘవ దగ్గరా అందుకున్న ఉప్పు ఫలితంగా నితిన్‌కి సెంట్‌పెర్‌సెంట్.

ఇదీ ఓవర్ టేకింగ్‌లో నా మొదటి అనుభవం!

* * *

ఎమ్.పి.సి.గ్రూపులో నేనూ, శర్వంత్ ఒకే కాలేజీలో చేరాం! మేమిద్దరం ఒకే సెక్షను. ప్రతీ పరీక్షలోనూ నేను ఫస్టు రాంకులోనూ, శర్వంత్ సెకండు రాంకులోనూ ఉండేవాళ్ళం.

ఎమ్‌సెట్‌లో కూడా అల్ఫా బెటికల్ ఆర్డరు ప్రకారం శర్వంత్, తర్వాత నేనూ ఎగ్జామ్ హాల్లో కూర్చున్నాం!

అక్కడా అంతే!

"ఎనభై ఎనిమిదో బిట్ జవాబు ఏంటోయ్?" శర్వంత్ అడిగాడు.

"సి" నేను మెల్లగా గొణిగాను.

అంతే, ఆ సంవత్సరం తొంబై ఎనిమిది మార్కుల వద్ద కౌన్సిలింగ్ ఆగిపోయింది.

శర్వంత్ సరిగ్గా తొంబై ఎనిమిది మార్కులు తెచ్చుకుని బి.టెక్‌లో చేరిపోయాడు.

నాకు తొంబై ఏడు మార్కులు రావటం వలన నాకు నిరాశే మిగిలింది.

మళ్ళీ "ఓవర్ టేకెన్!"

* * *

ఆ తర్వాత సంవత్సరం ఇంజనీరింగ్‌లో పదో రాంకుతో సీటు సంపాదించిన నేనూ, శర్వంత్ ఇంచుమించుగా ఒకేసారి బి.టెక్. డిగ్రీలు తీసుకున్నాం.

ఇద్దరం ఒకే ప్రైవేటు ఫర్మ్‌లో ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అప్లై చేశాం!

మెరిట్ ప్రకారం చూస్తే డిస్టింక్షన్స్‌తో ప్యాసయిన నాకే శర్వంత్ కంటే ఆ పోస్టు రావడానికి ఎక్కువ ఛాన్సెస్ ఉన్నాయి.

కానీ శర్వంత్ వాళ్ళ వేలు విడిచిన మేనమామకీ ఆ కంపెనీ మేనేజింగు డైరెక్టరుకూ ఉన్న సాన్నిహిత్యం నాకా ఉద్యోగాన్ని సుదూరం చేసింది.

ఇది మరో "ఓవర్ టేకింగ్" అనుభవం.

అయితే మూడు మాసాల తరువాత అదే కంపెనీలో అదే తరహా ఉద్యోగానికి నేను అప్లై చేయకపోయినా కాల్ లెటర్ పంపి నన్ను ఎప్పాయింట్ చేశారు ఎమ్.డి.గారు.

దీని ప్రభావం మాత్రం అంత తేలిగ్గా తీసేయదగింది కాదు-

మరో మూడేళ్ళ తర్వాత ఆ కంపెనీలోనే వచ్చింది సీనియర్ ఎగ్జిక్యూటివ్ వేకెన్సీ-

నేనూ, శర్వంత్- మేమిద్దరమే దానికి అర్హులం!

సీనియర్ ఎగ్జిక్యూటివ్ అంటే మాటలా? కంపెనీ కారు, పోష్ లొకాలటీలో రెండెత స్థుల ఫ్రీ క్వార్టర్సూ, కుక్కూ, కంపెనీ డైరెక్టర్లతో పార్టీల కిక్కులూ! వాహ్- ఇంకేం కావాలి.

కానీ, మూడు నెల్లు నాకంటే ముందుగా చేరిన శర్వంత్‌ని సీనియారిటీ నెపంతో ప్రమోట్ చేశారు.

మళ్ళీ 'ఓవర్ టేకింగ్' పొగరుబోతు గుర్రంలా ఫెడీల్మని తన్నింది-బోర్లా పడేట్లు.

* * *

ఇవన్నీ కెరీర్‌లో ఓవర్ టేకింగులయితే కేక్‌వాక్ లాంటి 'లవ్ ఎఫైర్'లో కూడా ఇలాంటి చెంపదెబ్బే తినాల్సి వచ్చింది.

ఉద్యోగంలో చేరిన సంవత్సరం తర్వాత అదే కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా చేరిన తేజస్విని బి.టెక్., నిజంగా తేజస్వినే!

వంకీల జుట్టూ, వాలు జడ, విశాలమైన నుదురు, నుదుటి మీద ఎర్రని మందారం మొగ్గలా బొట్టూ..కాటుక పెట్టని కాటుక కళ్ళూ, కొనదేరి కొంచెం పై చూపుచూసే ముక్కూ- అరనున్నాలాంటి మూతి, వయ్యారమైన సన్నని నడుమూ, ఎడం బుగ్గమీద బఠాణి గింజంత పుట్టుమచ్చ, నవ్వితే సొట్టలు పడే బూరె బుగ్గలూ, ఛామనఛాయ.

ఇంతకంటే అందానికి 'డెఫినిషన్' అక్కర్లేదనుకుంటా!

ఒకరోజున - ఈ అందాల బొమ్మ తన పుట్టిన రోజున 'టీ'కి రమ్మని ఇంటికి పిల్చింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి ఆరుగంటలకు నేరుగా ఆమె ఉండే ఎపార్టుమెంటుకి వెళ్ళాను.

పార్టీ సింపుల్- నేనొక్కడినే గెస్టుని. పార్టీలో ఆమె కొంచెం చనువుగానే బిహేవ్ చేసింది. నాకు షర్టు పై గుండీ పెట్టుకునే అలవాటు లేదు. ఆమె ముందుకు వంగి నా గుండెలపై తన మెత్తని చేతులతో, గుండీ పెట్టి నర్మగర్భంగా నవ్వింది. అదొక షాకైన షాక్.

* * *

"హలో మిస్టర్ సతీష్" అభివాదంగా చెయ్యి ఊపుతూ నా సీటు దగ్గరికి వచ్చింది మిస్ హసీనా- మా కంపెనీలోనే పనిచేస్తోంది.

"హలో!" బదులుగా చిరునవ్వు నవ్వాను.

"వై డోంట్ యు ప్రపోజ్ టు తేజస్వినీ? షీ ఈజ్ క్రేజీ ఆఫ్టర్ యూ" - ఒక చిన్న సలహా పారేసి, సన్నగా జారుకుంది హసీనా.

నాకు తేజస్విని మీద ప్రేమ ఉంది. కానీ గుండె గొంతులోకి వచ్చి, ఆమెను ప్రేమిస్తున్నాను అనే నిజాన్ని నిబ్బరంగా బయట పెట్టలేకపోయాను.

ఇది జరిగిన నెల తరువాత, తేజస్విని ఇన్విటేషన్ కార్డు నా చేతిలో పెట్టి "తప్పక రండి" అని ముక్తసరిగా ఆహ్వానించింది.

ఆమె బయటకు వెళ్ళాక కార్డు తీసి చూస్తే, ఆమె పేరు ఎదురుగా, వరుడు - 'శర్వంత్'.

దిగ్భ్రాంతుడనయ్యాను. తరువాత తెలిసింది. అందని నాలాంటి అమాయక ప్రాణి కంటే అందిన అందాన్ని అందుకోవటం మేలని. తనని ఆరాధించే శర్వంత్‌లాంటి వాడిని జీవిత భాగస్వామిగా చేసుకుంటే జీవితం సాఫీగా సాగిపోతుందనే తెలివైన నిర్ణయాన్ని తేజస్విని తీసుకుందని!

ఇది నా జీవితాంతం కోలుకోలేని దెబ్బగా పరిణమించిన 'ఓవర్ టేకింగ్'

**-పి.సత్యప్రసాద్ (రాజమండ్రి)**